కాగిత రహిత కార్యకలాపాలు కొనసాగించాలి

- అధికారులతో సమావేశంలో పేట కలెక్టర్ సిక్తాపట్నాయక్

పేట కలెక్టర్‌కు మొక్కను అందజేస్తున్న ఎస్పీ యోగేశ్ గౌతమ్, పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే పర్ణికారెడ్డి, డీసీసీ మాజీ అధ్యక్షుడు శివకుమార్‌రెడ్డి

నారాయణపేట టౌన్, జూన్ 18: ప్రభుత్వ కార్యాలయాల్లో కాగిత రహిత కార్యాకలాపాలు కొనసాగించాలని కలెక్టర్ సిక్తాపట్నాయక్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. అధికారులు తమకు కేటాయించిన శాఖలకు సంబంధించి ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో చాలామంది సీనియర్ అధికారులు ఉండడం వలన పరిపాలన ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఇక నుంచి మండల స్థాయిలో ప్రత్యేక అధికారిని నియమించి ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణ, పర్యవేక్షణ చేస్తామన్నారు. గత కలెక్టర్ మాదిరిగానే అందరు అధికారుల సహకారంతో జిల్లా అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. అనంతరం అధికారులు తమ శాఖలకు సంబంధించిన ప్రగతి పనులు, లక్ష్యాలు, ప్రస్తుత స్థితికి సంబంధించిన నివేదికలు సమర్పించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్‌లు అశోక్‌కుమార్, మయాంక్ మిట్టల్, ఏవో నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే..

నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ సిక్తాపట్నాయక్‌ను మంగళవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో పేట ఎమ్మెల్యే పర్ణికారెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో డీసీసీ మాజీ అధ్యక్షుడు కుంభం శివకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఎస్పీ..

నారాయణపేట, జూన్ 18: నారాయణపేట కలెక్టర్ సిక్తా పట్నాయక్‌ను మంగళవారం కలెక్టరేట్‌లో ఎస్పీ యోగేశ్ గౌతమ్ మర్యాద పూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లాకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు.

సమర్థవంతంగా పనిచేయాలి

- మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేందిర బోయి

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర బోయి, శుభాకాంక్షలు తెలుపుతున్న జెడ్పీ వైస్‌పర్సన్

మహబూబ్‌నగర్ అర్బన్, జూన్ 18: ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేర్చేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో సమర్థవంతంగా తమ లక్ష్యాలను పూర్తి చేయాలని మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. మంగళవారం జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో వివిధశాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలోని వివిధ శాఖల ద్వారా అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, సమస్యలను ఆయా శాఖల అధికారులు సమావేశంలో వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్ని శాఖల అధికారుల సహకారంతో జిల్లాలో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేసేందుకు కృషి చేస్తానని అన్నారు. ప్రజావాణి ద్వారా ప్రజలు నుంచి వచ్చిన దరఖాస్తులు త్వరగా పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాకాలం కాబట్టి వైద్య ఆరోగ్యశాఖ, పంచాయతీ, నీటి పారుదల శాఖ అధికారులు సమన్వయంతో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలోని వానకాలంలో సాగు చేసే పంటలు, ఎరువులు, విత్తనాల సరఫరాపై దృష్టి సారించాలని, ప్రతిరోజు కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు. విద్యాశాఖ ద్వారా పాఠశాలల ప్రారంభం నాటికి ఒక జత యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ సరఫరా చేశామని, అమ్మ ఆదర్శ పాఠశాల ద్వారా 642 స్కూళ్లల్లో అత్యవసర పనులు చేపట్టినట్లు విద్యాశాఖ అధికారులు వెల్లడించారు. ఎస్సీ, ఎస్టీ, మై నార్టీ, ఇంటర్ మీడియట్ విద్య, పౌర సరఫరాల శాఖ, మిషన్ భగీరథ, గనులు, భూగర్భజలాలు, మున్సిపాలిటీ, గ్రామీణాభివృద్ధి, పరిశ్రమలు పలుశాఖల అధికారులు సమస్యలను కలెక్టర్‌కు వివరించారు. ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాలని, అన్నిశాఖల అధికారులు ప్రతి నెలా సమీక్ష సమావేశాలు నిర్వహించుకోవాలని సూచించారు. సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్‌రావుతోపాటు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు శుభాకాంక్షలు

మహబూబ్‌నగర్ అర్బన్, జూన్ 18: కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన విజయేందిర బోయిని మంగళవారం జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణాసుధాకర్‌రెడ్డి, జెడ్పీ సీఈవో రాఘవేందర్‌రావు, పలువురు అధికారులు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

ఎమ్మార్పీఎస్ నాయకులు..

హన్వాడ, జూన్ 18 : మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ విజయేందిర బోయిని మంగళవారం తెలంగాణ ఎమ్మార్పీఎస్ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పూలమాల, శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో జంబులయ్య, నరేశ్, కృష్ణ, ఉపాధ్యక్షుడు వీరేశ్, నాయకులు రాజు, నరసింహ, నరేశ్, స్వామి, యాదయ్య తదితరులు ఉన్నారు.

సివిల్ సర్వీసెస్ అభ్యర్థులకు లాంగ్‌టర్మ్ ఉచిత శిక్షణ

పాలమూరు, జూన్ 18 : సివిల్ సర్వీసెస్-2025 సంవత్సరంలో పరీక్ష రాసే అభ్యర్థులకు తెలంగాణ బీసీ స్టడీ సర్కిల్ హైదరాబా ద్ ద్వారా ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు బీసీ స్టడీసర్కిల్ సంచాలకులు స్వప్న, బీసీ అభివృద్ధి అధికారి ఇందిర మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఉ మ్మడి మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, నారాయణపేట జిల్లాలకు చెం దిన బీసీ, ఎస్సీ, ఎస్టీ అర్హులైన అభ్యర్థులు డిగ్రీ పాస్ అయి ఉండాలని, ఈనెల 19 నుంచి జులై 3వ తేదీలోపు ఆన్‌లైన్ ద్వారా TGBC STDYCIRCLE.CGG.GOV.IN వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 08542-29370 నెంబర్‌ను సం ప్రదించాలని కోరారు.

గ్రూప్-2 గ్రాండ్ టెస్ట్‌కు దరఖాస్తు..

బీసీ స్టడీ సర్కిల్ మహబూబ్‌నగర్ ఆధ్వర్యంలో టీజీపీఎస్సీ గ్రూప్-2 గ్రాండ్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు బీసీ స్టడీసర్కిల్ సంచాలకులు స్వప్న మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఆఫ్‌లైన్ పద్ధతిలో పరీక్ష జరుగుతుందని, మొత్తం నాలుగు గ్రాండ్ టెస్టులు ఒక్కో గ్రాండ్ టెస్ట్‌కి నాలుగు పేపర్లు నిర్వహిస్తామని తెలిపారు. గ్రూప్-2 గ్రాండ్ టెస్ట్‌కు ఆసక్తిగల అభ్యర్థులు తమ దరఖాస్తులను ఆన్‌లైన్ వెబ్ సైట్ TGBCSTDYCIRCLE.CGG.GOV.IN లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 08542-2293790 లేదా మహబూబ్‌నగర్ మెట్టుగడ్డ బీఈడీ కళాశాలలో సంప్రదించాలని కోరారు.

విద్యార్థులకు నీట్ ఉచిత శిక్షణ

పాలమూరు, జూన్18: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో 2024-25 సంవత్సరానికి రాష్ట్ర వ్యాప్తంగా షెడ్యుల్డ్ కులాల బాలబాలికలకు నీట్ లాంగ్‌టర్మ్ కోచింగ్‌ను గౌలిదొడ్డి, చిలుకూరు, నార్సింగి, మహేంద్రహిల్స్‌లో ఉచితంగా ఇవ్వనున్నట్లు గురుకులాల ప్రాంతీయ సమన్వయ అధికారి ఫ్లారెన్స్‌రాణి తెలిపారు. ఇంటర్ ఉత్తీర్ణులై నీట్ పరీక్షకు హాజరైన విద్యార్థులు www.tgswreis.telangana.gov.in రూ.200 చెల్లించి ఈ నెల 24లోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

మహ్మదాబాద్, జూన్ 18: మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ రవీందర్ తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూపుల్లో ఇంగ్లిష్, తెలుగు మీడియంలో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. మార్కుల మెమో, ఆధార్‌కార్డుతో ఉచితంగా ప్రవేశం పొందవచ్చని పేర్కొన్నారు. విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలతో పాటు స్కాలర్‌షిప్ సౌకర్యం ఉంటుందని తెలిపారు. మహ్మదాబాద్ మండలంతో పాటు చుట్టుపక్కల మండలాల్లో పదో తరగతి పాసైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

21న స్పోర్ట్స్ స్కూల్ ఎంపికలు

మక్తల్, జూన్ 18: మక్తల్ మినీ స్టేడియంలో ఈనెల 21న స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపికలు నిర్వహిస్తున్నట్లు మక్తల్ ఎంఈవో వెంకటయ్య మంగళవారం తెలిపారు. ఎంఈవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కలెక్టర్ సిక్తా పట్నాయక్, డీఐఈఎస్‌ఓ ఆదేశాలతో 21న ఉదయం 9గంటలకు ఎంపికలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం నాలుగో తరగతి చదువుతున్న ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు మక్తల్, మాగనూర్, కృష్ణ, ఊట్కూర్, నర్వ మండలాల విద్యార్థులు 01-09-2015 నుంచి 31-08-2016 మధ్య జన్మించిన బాలబాలికలు ఈ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులని తెలిపారు. ఈ పోటీల్లో నైపుణ్యం ప్రదర్శించిన వారిని 29న జిల్లా కేంద్రంలో జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక చేస్తారని పేర్కొన్నారు. పూర్తి సమాచారం కోసం సెల్ నెంబర్ 77027 13139ను సంప్రదించాలని కోరారు.

తాత్కాలిక ఆధార్ కేంద్రాల ఏర్పాటు

మక్తల్, జూన్ 18: ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థుల కోసం నారాయణపేట కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశాలతో రెండు తాత్కాలిక ఆధార్ కేంద్రాలను మక్తల్‌లో ఏర్పాటు చేశామని ఎంఈవో వెంకటయ్య తెలిపారు. ఎంఈవో కార్యాలయం ఎదురుగా ఒకటి, శాంతినికేతన్ పాఠశాలలో మరోటి ఏర్పాటు చేశామన్నారు.

కురుమూర్తి ఆలయ హుండీ ఆదాయం రూ.4,66,646

దేవరకద్ర రూరల్ (చిన్నచింతకుంట), జూన్ 18 : చిన్నచింతకుంట మండలం అమ్మాపూర్ సమీపంలోని సప్తగిరుల మధ్య కాంచనగుహలో కొలువుదీరిన శ్రీకురుమూర్తిస్వామి హుండీని మంగళవారం ఆలయ కార్యనిర్వహణ అధికారి మదనేశ్వర్‌రెడ్డి సమక్షంలో లెక్కించారు. మొత్తం రూ.4,66,646 ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. హుండీ లెక్కింపులో ఆలయ సిబ్బంది, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

గున్ముక్ల బస్సును పునరుద్ధరించాలి

ధన్వాడ, జూన్ 18: మరికల్ నుంచి గున్ముక్లకు ఆర్టీసీ బస్సును పునరుద్ధరించాలని ఎంపీటీసీ సుధీర్‌కుమార్ రావు, మాజీ ఎంపీటీసీ గౌని శ్రీనివాసులు డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గున్ముక్ల బస్సు రద్దు కావడంతో మంత్రోనిపల్లి, ఎంనోనిపల్లి గ్రామాల విద్యార్థులు ఇబ్బందిపడుతున్నారన్నారు. వనపర్తి డిపో అధికారులు మరికల్ నుంచి గున్ముక్లకు రెండుసార్లు బస్సు నడిపి విద్యార్థుల కష్టాలను తీర్చాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో మారెమ్మ జాతర

ఎమ్మెల్యే శ్రీహరిని సన్మానిస్తున్న గ్రామస్తులు

మక్తల్, జూన్ 18: మక్తల్ మున్సిపాలిటీలోని రెండోవార్డు దండులో మంగళవారం ఉదయం నిర్వహించిన మారెమ్మ జాతరలో మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దండు గ్రామ ప్రజలకు అమ్మవారి ఆశీస్సులు ఎల్లవేళలా ఉంటాయన్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ఘనంగా సన్మానించారు. మహిళలు పెద్దవత్తున అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

గజలమ్మ జాతరలో ఎమ్మెల్యే పూజలు

నారాయణపేట, జూన్ 18: పట్టణంలోని పళ్లలో ఉన్న పోల్కమ్మ, అశోక్‌నగర్‌లో ఉన్న గజలమ్మ జాతర ఉత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు బోనాలతో అమ్మవారి ఆలయాల వద్దకు చేరి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు. గజలమ్మ జాతర ఉత్సవాల్లో ఎమ్మెల్యే పర్ణికారెడ్డి పాల్గొని పూజలు చేశారు.

ఆయిల్ ట్యాంకర్ బోల్తా

రాజాపూర్, జూన్ 18: మండలంలోని ముదిరెడ్డిపల్లి గ్రామ సమీపంలోని జాతీయ రహదారిపై ఆయిల్ ట్యాంకర్ బోల్తాపడిన ఘటన మంగళవారం చోటు చేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాలు.. జడ్చర్ల నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న ఆయిల్ ట్యాంకర్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని, బోల్తా పడింది. ఈప్రమాదంలో నాగర్ కర్నూల్ జిల్లా దొడ్లపల్లికి చెందిన హుస్సేన్‌కు తీవ్రగాయాలయ్యాయి. లారీలో ప్రయాణిస్తున్న మహిళకు స్వల్ప గ్రాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108 వాహనంలో జడ్చర్ల దవఖానాకు తరలించారు. ట్యాంకర్ ఖాళీగా ఉండడంతో భారీ ప్రమాదం తప్పిందన్నారు.

నిబద్ధతతో పనిచేస్తేనే గుర్తింపు

వీడ్కోలు సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీహర్ష

నారాయణపేట టౌన్, జూన్ 18: చేసే వృత్తిని నిబద్ధత, చిత్తశుద్ధితో చేయాలని కలెక్టర్ శ్రీహర్ష అన్నారు. రెండేండ్లుగా పేట కలెక్టర్‌గా విధులు నిర్వర్తించి, ఇటీవలే పెద్దపల్లికి బదిలీ అయిన శ్రీహర్షకు మంగళవారం జిల్లా స్థాయి అధికారులు ఘనంగా వీడ్కోలు పలికారు. కలెక్టర్ బంగ్లాలో మక్తల్ ఎమ్మెల్యే శ్రీహరి, అదనపు కలెక్టర్ మయాంక్‌మిట్టల్ శ్రీహర్షను కలిసి శాలువాతో సన్మానించి, పుష్పగుచ్ఛం అందజేశారు. అదేవిధంగా మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ రాంకిషన్, డీఏవో జాన్‌సుధాకర్, డీఆర్డీవో రాజేశ్వరి, జిల్లా సంక్షేమాధికారి కృష్ణమాచారి తదితరులు శాలువాతో సన్మానించి, పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా రెండేండ్ల పాటు తనకు సహకరించిన ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులకు కలెక్టర్ శ్రీహర్ష ధన్యవాదాలు తెలిపారు.

నీట్ పరీక్షను రద్దు చేయాలి

- మరికల్‌లో ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో విద్యార్థుల ధర్నా

మరికల్‌లో ధర్నా చేస్తున్న ఎన్ఎస్‌యూఐ విద్యార్థులు

మరికల్, జూన్ 18: కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన నీట్ పరీక్షలో అవకతవకలు జరిగాయని, వెంటనే పరీక్షను రద్దుచేసి మళ్లీ నిర్వహించాలని నారాయణపేట జిల్లా ఎన్ఎస్‌యూఐ కార్యనిర్వాహక అధ్యక్షుడు వింజమూర్ దామోదర్‌రెడ్డి డిమాండ్ చేశా రు. మంగళవారం మండల కేంద్రంలో విద్యార్థులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తర భారతదేశానికి చెందిన కొందరు నీట్ పరీక్షల్లో అవినితికి పాల్పడి ఎంబీబీఎస్ సీట్లను తెలంగాణలో పొందాలని చూశారని, అవినీతికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకొని, తెలంగాణ విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ నాయకులు హరీశ్‌రెడ్డి, నాగరాజు, అన్వర్, సమర్‌రెడ్డి, మోహబూబ్ తదితరులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథపై సర్వే

దేవరకద్ర, జూన్ 18 : మండల కేంద్రంతోపాటు మండలంలోని అన్ని గ్రామాల్లో మిషన్ భగీరథ తాగునీటి సర్వే ముమ్మరంగా నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శ్రీనివాసులు తెలిపారు. మండల కేంద్రంతోపాటు మండలంలోని పలు గ్రామాల్లో మిషన్ భగీరథ నీటి సరఫరా సర్వేపై ఆయన ఆరా తీశారు.

హరితహారానికి సర్వం సిద్ధం

దేవరకద్ర, జూన్ 18 : పభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న హరితహార పథకానికి సిద్ధం చేసినట్లు మేజర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి నీతానాయక్ తెలిపారు. మంగళవారం కోయిల్‌సాగర్ రోడ్డుకు ఇరువైపులా హరితహారంలో భాగంగా ఉపాధి హామీ కూ లీలతో మొక్కలు నాటేందుకు గుంతలు తీయించారు.

కలప లారీ పట్టివేత

మహ్మదాబాద్, జూన్ 18: మండలంలోని మంగంపేట్ సమీపంలో సోమవారం రాత్రి అక్రమంగా కలపను తరలిస్తున్న లారీని పక్కా సమాచారంతో పోలీసులు పట్టుకున్నారు. మహ్మదాబాద్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మంగళవారం లారీని అటవీశాఖ అధికారులకు అప్పగించారు. పూర్తి విచారణ చేసిన అనంతరం లారీ యజమాని, కలప తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటామని ఫారెస్టర్‌రేంజ్ అధికారి సయ్యద్ ముఖ్దూమ్ తెలిపారు.

పోలమ్మ దేవత ఉత్సవాలు

కృష్ణ, జూన్ 18 : మండలంలోని గుడెల్లూర్‌లో పోలమ్మదేవి ఉత్సవాలు మంగళవారం నేత్రపర్వంగా నిర్వహించారు. ఉదయం నుంచి గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుద్దీపాలతో ముస్తాబు చేశారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకొని అమ్మవారికి నైవేద్యం సమర్పించి, మొక్కు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు, గ్రామపెద్దలు తదితరులు పాలొన్నారు.

పెరిగిన ధాన్యం ధరలు

జడ్చర్ల, జూన్ 18: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌లో మొక్కజొన్న క్వింటా రూ.2,500 పలికింది. మంగళవారం ఆర్ఎన్ఆర్ ధాన్యం అత్యధికంగా క్వింటా రూ.3,069లు పలికింది. కనిష్ఠంగా రూ.1,950, మధ్యస్తంగా రూ.2,249 ధర పలికింది. అదేవిధంగా మార్కెట్‌కు 383క్వింటాళ్ల మొక్కజొన్నలు అమ్మకానికి రాగా, క్వింటాకు గరిష్ఠంగా రూ.2,501 లభించింది. 48 క్వింటాళ్ల హంసరకం ధాన్యం అమ్మకానికి రాగా, క్విం టా గరిష్ఠంగా రూ.1,850, 3క్వింటాళ్ల జొన్న లు అ మ్మకానికి రాగా క్వింటాకు గరిష్ఠంగా రూ.3,777, అదేవిధంగా 4క్వింటాళ్ల వేరుశనగ అమ్మకానికి రాగా క్వింటాకు గరిష్ఠంగా రూ.3,209 పలికింది. 11క్వింటాళ్ల హంసరకం ధాన్యం అమ్మకానికి రాగా క్వింటాకు గరిష్ఠంగా రూ.5,629 లభించింది.

నోట్ పుస్తకాల పంపిణీ

మహబూబ్‌నగర్, జూన్ 18: భారతసేవాశ్రమ సంఘం రాష్ట్ర కార్యదర్శి స్వామి మునీశ్వరనంద జీ నేతృత్వంలో మంగళవారం మహబూబ్‌నగర్‌లో రెడ్‌క్రాస్ సమన్వయంతో 22 ప్రభుత్వ పాఠశాలల్లో పేద విద్యార్థులకు ఉచితంగా నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. స్థానిక ప్రభుత్వ మోడల్ బేసిక్ ఉన్నత పాఠశాలలో జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణా సుధాకర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, డీఈవో రవీందర్ చేతులమీదుగా పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ వనజ, రెడ్‌క్రాస్ చైర్మన్ లయన్ నటరాజ్, కోఆర్డినేటర్ బాబుల్ రెడ్డి, మేనేజర్ నరసింహ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రూప్-1 అభ్యర్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

పాలమూరు, జూన్18: మహబూబ్‌నగర్ జిల్లా ఎస్సీ స్టడీ సర్కిల్‌లో గ్రూప్-1 పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు మంగళవారం ఉచితంగా మెటీరియల్‌ను డీడీ పాండు, ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ కాడం శ్రీనివాస్ అందజేశారు.

రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ ఎన్నిక

మహబూబ్‌నగర్ అర్బన్, జూన్ 18 : మహబూబ్‌నగర్ పట్టణ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ మంగళవారం ఎన్నికైంది. ఎన్నికల అధికారిగా కొత్త చంద్రశేఖర్ వ్యవహరించారు. 2024-26 ఏడాదికిగానూ జరిగిన ఎన్నికల్లో పోటీ లేకుండా అధ్యక్షుడిగా చెన్నారపు కారుకొండ కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శిగా ధర్మాపురం కుమారస్వామి, కోశాధికారిగా కొకుంట్ల రామకృష్ణ, ఉపాధ్యక్షులుగా కొకుంట్ల రమేశ్‌గుప్తా, గౌడంపల్లి దామోదర్, సహాయ కార్యదర్శులుగా కొక్కళ్ల శ్రీనివాసులు, విసనకర్ర సురేశ్, సభ్యులుగా కొకుంట్ల హరినాథ్, సంబు లక్ష్మీనారాయణ ఎన్నికయ్యారు.

జౌట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న జౌట్‌సోర్సింగ్ కార్మికులు

జడ్చర్ల, జూన్ 18: మున్సిపాలిటీలో కాంట్రాక్ట్ జౌట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరుతూ మంగళవారం కార్మికులు ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. జడ్చర్లలోని క్యాంప్ కార్యాలయంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రంలో మున్సిపల్ కాంట్రాక్ట్ జౌట్‌సోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని ప్రభుత్వానికి తెలియజేయాలని కోరారు. థర్డ్‌పార్టీకి అప్పజెప్పాలనే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాల ని, పీఆర్‌సీలో కనీస వేతనం రూ.26వేలుగా నిర్ణయించాలని కోరారు. ఇతర సమస్యలను విన్నవించారు. కార్యక్రమంలో శివకుమార్, వెంకటయ్య, మీన్నాజ్, యూనియన్ నాయకులు వెంకటేశ్, మహేశ్, కృష్ణ, అ లివేలు, అంజమ్మ, కేశవులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు పెండింగ్ డబ్బులు చెల్లించాలి

ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కూలీలు

జడ్చర్ల టౌన్, జూన్ 18 : ఉపాధి హామీ కూలీలకు పెండింగ్ డబ్బులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం జడ్చర్ల ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్‌రాములు మాట్లాడారు. అనంతరం ఎంపీడీవో వెంకట్‌ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు జగన్, మోహన్, నర్సింహులు, జయరాములు, యాదయ్య పాల్గొన్నారు.

ఇంటింటి సర్వే త్వరగా పూర్తి చేయాలి

కాకర్లపహాడ్‌లో ఇంటింటి సర్వేను పరిశీలిస్తున్న ఎంపీవో భద్రూనాయక్

నవాబ్‌పేట, జూన్ 18 : మిషన్ భగీరథ ఇంటింటి సర్వేను త్వరగా పూర్తి చేయాలని ఎంపీవో భద్రూనాయక్ సంబంధిత సిబ్బందికి సూచించారు. మండలంలోని రుద్రారం, సిద్దోటం, కారుకొండ, కాకర్లపహాడ్ గ్రామాల్లో చేపడుతున్న సర్వేను ఆయన మంగళవారం పరిశీలించి సర్వే వివరాలను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ ఆదేశానుసారం ఈనెల 20వ తేదీ నాటికి సర్వే పూర్తి చేయాలని సూచించారు. మండలంలోని 16, 714 నల్లా కనెక్షన్లకు గానూ ఇప్పటి వరకు 13, 559 పూర్తి చేయడం జరిగిందన్నారు. మిగతావి రెండు రోజుల్లో పూర్తి చేయాలన్నారు. అలసత్వం వహించే వారిపై చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

కేంద్ర మంత్రికి సన్మానం

కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఉప్పరి రజినీసాగర్

మూసాపేట, జూన్ 18 : కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను మూసాపేటకు చెందిన కొత్త ఉప్పరి రజినీసాగర్ మంగళవారం సన్మానించారు. ఆయన కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను ఢిల్లీలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు.

జీవో-2ను రద్దుచేయాలి

జడ్చర్ల, జూన్ 18 : జీవో-2ను రద్దుచేయాలని, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయుల పదోన్నతుల్లో అడ్డేస్తే విధానాన్ని ఎత్తివేయాలంటూ జడ్చర్లలోని ఎమ్మార్సీ కార్యాలయం ఎదుట మంగళవారం టీజీయూఎస్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీజీయూఎస్ నాయకులు గోవింద్‌నాయక్, తారాసింగ్, శంకర్‌నాయక్, శోభ, రాధిక తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్సీ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

మాత్రలు పంపిణీ చేయాలి

భూ